## 10లక్షల ఎకరాలకు వరి విత్తనాలు

### రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): వానాకాలం సీజన్‌లో 10లక్షల ఎకరాలకు వరి విత్తనాలతో పాటు, కంది, పెసర, మినుము విత్తనాలకు లోటులేకుండా ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం విత్తనాభివృద్ధి సంస్థ ప్రధాన కార్యాలయంలో విత్తన సేకరణ, సరఫరాపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వానాకాలంలో సంస్థ ఆధ్వర్యంలో 1.50లక్షల ఎకరాలకు మాత్రమే వరి విత్తనాలు అందించిందని.. ఈ సీజన్‌లో 10లక్షల ఎకరాలకు విత్తనాలు అందించే విధంగా ప్రణాళికా రూపొందించాలని ఆదేశించారు. అలాగే కంది, పెసర, మినుము విత్తనాలు కూడా ఎలాంటి లోటులేకుండా ఇవ్వాలని కోరారు. రైతులకు అవగాహన కల్పిస్తూ, నాణ్యమైన విత్తనాలు వినియోగించి.. అధిక దిగుబడులు సాధించేలా సహకారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, సంస్థ ప్రాంతీయ మేనేజర్లు, ఆపరేషన్ హెడ్‌లు తదితరులు హాజరయ్యారు.

# కేసీఆర్‌ది సాగుభాష.. రేవంత్‌ది సావుభాష

- నాడు తెలంగాణను నిలబెట్టిన కేసీఆర్
- నేడు రాష్ట్రాన్ని పడగొట్టిన రేవంత్
- ఢిల్లీలో ఇక రేవంత్ రెడ్డి పని అయిపోయింది
- మీనాక్షి చెప్తేనే విద్యార్థులపై కేసుల ఎత్తివేత!
- మాజీ మంత్రి హరీశ్‌రావు
- తెలంగాణ ప్రయోజనాలకు కట్టుబడి ఉన్నాం : మధుసూదనాచారి



పటాన్‌చెరు మండలం గణేశ్‌గడ్డలో మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, నాయకులు ఆదర్శ్‌రెడ్డి, సింధూ తదితరులు

సంగారెడ్డి, ఏప్రిల్ 9(నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ది సాగుభాష అయితే, సీఎం రేవంత్‌రెడ్డిది సావు భాష అని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సీఎం హోదాలో కేసీఆర్ పదేండ్లలో సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ కాకతీయ, చెక్‌డ్యామ్‌లు, నీటి తీరువా రద్దు గురించి మాట్లాడి తక్షణ నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి పేగులు మెడలో వేసుకుంటా, సంపుత, తొక్కుత, బట్టలూడదీస్త.. అంటూ సావు భాష మాట్లాడుతున్నారని విమర్శించారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్‌ఎస్ సమన్వయకర్త ఆదర్శ్‌రెడ్డి బుధవారం రామచంద్రాపురంలోని తన నివాసం నుంచి పటాన్‌చెరు మండలం గణేశ్‌గడ్డ సిద్ధివినాయక ఆలయం వరకు కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్ర ముగింపు కార్యక్రమానికి హరీశ్‌రావు హాజరయ్యారు. అనంతరం జరిగిన సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. ఢిల్లీలో సీఎం రేవంత్ పని అయిపోయిందని, ఆ పార్టీ అగ్రనేతలైన సోనియా, రాహుల్‌గాంధీ కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని ఎద్దేవా చేశారు. కనీసం బీసీ ధర్నాకు రాహుల్‌ను రేవంత్ రప్పించలేకపోయారని తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆదేశాలతో హెచ్‌సీయూ విద్యార్థులపై కేసులు ఎత్తివేస్తున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటన చేయటం ఇంకా గమ్మత్తైన విషయమని పేర్కొన్నారు. సీఎం, హోంమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి కేసులు పెడితే భట్టి విక్రమార్క కేసులు ఎత్తివేయడం చూస్తే విడ్డూరంగా ఉన్నదని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు కేసులు పెట్టారని భట్టి విక్రమార్క హెచ్‌సీయూ విద్యార్థులపై కేసులు ఎత్తివేయమన్నాడని, తప్పుడు కేసులు పెట్టినందుకు సీఎం రేవంత్‌రెడ్డి బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

### కాంగ్రెస్ అసమర్థ పాలనతో తిరోగమనం

కేసీఆర్ నాడు తెలంగాణను నిలబెటితే, నేడు రేవంత్ పడగొట్టిండని హరీశ్‌రావు మండిపడ్డారు. సీఎం కేసీఆర్ తన పదేండ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి కాంగ్రెస్‌కు అప్పగించారని, రేవంత్‌రెడ్డి తన అసమర్థ పాలనతో తెలంగాణను తిరోగమనం వైపు నడిపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో జీఎస్టీ గ్రోత్‌రేట్ 12 శాతం ఉంటే, ఇప్పుడు రేవంత్‌రెడ్డి పాలనలో 5శాతానికి చేరుకుందని విమర్శించారు.

### బంగారు తెలంగాణగా తీర్చిదిద్దిన కేసీఆర్

శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు మధుసూధనాచారి మాట్లాడుతూ కేసీఆర్ తన హయాంలో తెలంగాణను బంగారు తెలంగాణ తీర్చిదిద్దినట్టు చెప్పారు. తెలంగాణలో ఒక్కొక్క సమస్యను పరిష్కరించి రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు కేసీఆర్ నడిపించారని తెలిపారు. బీఆర్‌ఎస్ తెలంగాణ ప్రయోజనాలకు కట్టుబడి ఉన్నదని, ప్రజల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్‌ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి, కార్పొరేటర్లు సింధూ ఆదర్శ్‌రెడ్డి, మెట్టుకుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇలా రేవంత్‌రెడ్డి పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో వెనకబడిపోయిందని తెలిపారు. ప్రజలు తిరిగి కేసీఆర్ పాలనలను కోరుకుంటున్నారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఉమ్మడి మెదక్ జిల్లాలో 10 అసెంబ్లీ స్థానాల్లో గెలిచి కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు సంగారెడ్డిజిల్లా నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, కార్యకర్తలకు తరలిరావాలని పిలుపునిచ్చారు.



ములుగు జిల్లా గోవిందరావుపేటలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

## పంటలకు పరిహారం ఇవ్వాలని ధర్నా

- గోవిందరావుపేట తహసీల్ ఎదుట రైతుల నిరసన

గోవిందరావుపేట, ఏప్రిల్ 9 : వడగండ్ల వానతో పంట నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం లక్నవరం చెరువు కింది రైతులు ఆందోళనకు దిగారు. బుధవారం వారు గోవిందరావుపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. పంట నష్టపరిహారం కింద ఎకరానికి రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇండ్లు దెబ్బతిని నష్టపోయిన వారికి రూ.5 లక్షలు అందించాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

## 20 బోర్లేసినా చుక్కనీరు పడలే
## అప్పులభారంతో రైతు బలవన్మరణం

- సాగు, బోర్ల కోసం రూ.7 లక్షలకుపైగా అప్పు.. నిర్మల్ జిల్లాలో ఘటన

లోకేశ్వరం, ఏప్రిల్ 9: వేసిన పంటలను కాపాడుకునేందుకు ఆ రైతు ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 20 బోర్లు వేశాడు. అయినా చుక్కనీరు పడలేదు. అటు పంటలసాగుకు, బోర్లు వేసేందుకు సుమారు రూ.7 లక్షలకు పైగా అప్పులయ్యాయి. పంటలు నిలువునా ఎండిపోవడంతో అప్పులు తీర్చే దారి కనిపించలేదు. దీంతో మనస్తాపం చెందిన ఆ అన్నదాత తనువు చాలించాడు. విషాదకరమైన ఈ ఘటన నిర్మల్ నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం రాజురా గ్రామంలో బుధవారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన రైతు పతాని నడిపి మల్లన్న (62) తనకున్న ఎనిమిది ఎకరాల వ్యవసాయ భూమిలో ఈ సీజన్‌లో వరి, జొన్న పంటలను సాగుచేశాడు. సాగునీరు కరువై, భూగర్భజలాలు అడుగంటిపోగా, ఉన్న బోర్లు వట్టిపోయాయి. ఆ పంటలను కాపాడుకునేందుకు రైతు మల్లన్న కొత్తగా 20 బోర్లను వేశాడు. ఏ ఒక్కబోరులో చుక్కనీరు పడలేదు. పెట్టుబడికి, బోర్లు వేయడానికి దాదాపు రూ.7 లక్షలకు పైగా అప్పులు చేశాడు. దిగుబడి వచ్చే అవకాశం లేకపవడంతో మనస్తాపం చెందాడు. బుధవారం మధ్యాహ్నం పొలానికి వెళ్లొస్తానని ఇంటిలో చెప్పి వెళ్లాడు. తన వ్యవసాయ భూమిలోని వేప చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మల్లన్నకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రెండ్రోజులపాటు మోస్తరు వర్షాలు

- పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్ జారీ

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా రెండ్రోజులపాటు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ శాఖ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నది. చక్రవాత ఆవర్తనం, క్యుమిలోనింబస్ మేఘాల వల్ల గురు, శుక్రవారాల్లో పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వెల్లడించింది. దీని ప్రభావంతో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్టు వివరించింది. గురువారం సిద్దిపేట, హనుమకొండ, వరంగల్, జనగామ, యాదాద్రి, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో, శుక్రవారం హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఆరెంజ్, ఎల్లో అలర్ట్‌ను జారీ చేసినట్టు తెలిపింది. అలాగే పలు జిల్లాల్లో సాధారణకంటే 2 నుంచి 4 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని పేర్కొన్నది.

# నల్లగొండ కాంగ్రెస్‌లో 'ఉపాధి' చిచ్చు

- ఉపాధి పనుల్లో ఆధిపత్య పోరు
- గుత్తా ప్రతిపాదనలకు కోమటిరెడ్డి చెక్
- మంత్రి ఆదేశాలతో రూ.3 కోట్ల పనులు రద్దుచేసిన కలెక్టర్
- సీరియస్‌గా తీసుకున్న గుత్తా
- వివరణ కోరుతూ నోటీసు
- జిల్లా అధికార వర్గాల్లో తీవ్ర కలకలం





నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): నల్లగొండ జిల్లాలో జాతీయ ఉపాధి హామీ నిధుల అంశం జిల్లా కాంగ్రెస్ పార్టీలో చిచ్చు రేపింది. ఏకంగా ముఖ్య నేతల నడుమ విభేదాలకు దారితీసింది. ఉపాధి హామీ నిధులతో చేపట్టాల్సిన పనుల ప్రతిపాదనలే శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మధ్య ఆధిపత్యపోరుకు బీజం వేసింది. ఎమ్మెల్సీగా తనకున్న పరిధిలో జిల్లాలో ఎక్కడైనా పనులను ప్రతిపాదించే హక్కు తనకు ఉన్నదని మండలి చైర్మన్ గుత్తా భావిస్తుంటే, తనకు తెలియకుండా జిల్లాలో పనులను ప్రతిపాదిస్తే ఊరుకునేది లేదని మంత్రి కోమటిరెడ్డి హెచ్చరిస్తున్నారు. వీరిద్దరి మధ్య ఆధిపత్య పోరు అధికారులకు తలనొప్పిగా మారి ఏకంగా కలెక్టర్‌కు అసెంబ్లీ సెక్రటరీ నుంచి నోటీసు ఇచ్చేవరకు దారితీసింది. గుత్తా సుఖేందర్‌రెడ్డి ఎమ్మెల్సీగా తనకున్న అధికారంతో గత నెల రెండో వారంలో రూ.3 కోట్ల విలువైన ఉపాధి హామీ నిధులతో చేపట్టాల్సిన పనులను ప్రతిపాదించారు. నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గంలో రూ.1.50 కోట్లు, నకిరేకల్ నియోజకవర్గంలో రూ.70 లక్షలు, నాగార్జునసాగర్, దేవరకొండ నియోజకవర్గాల్లో మిగతా పనుల కోసం ప్రతిపాదనలు ఉన్నాయి. ఆ ప్రతిపాదనలను కలెక్టర్ ఇలా త్రిపాఠి ద్వారా జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆమోదం కోసం పంపించారు. తుమ్మల వెంటనే ఆమోదం తెలపడంతో తిరిగి కలెక్టర్ త్రిపాఠి వాటి గ్రౌండింగ్ కోసం ప్రొసీడింగ్స్ జారీచేశారు. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. ఇలా జారీ అయిన ప్రొసీడింగ్స్‌పై అభ్యంతరం వ్యక్తంచేస్తూ నల్లగొండ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకత్వం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఫిర్యాదు చేసింది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న మంత్రి కోమటిరెడ్డి కలెక్టర్ ఇలా త్రిపాఠిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. గుత్తా ప్రతిపాదనలను తనకు తెలియకుండా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదానికి ఎలా పంపిస్తారని ఆగ్రహం వ్యక్తంచేస్తూ, తక్షణమే వాటిని రద్దుచేస్తూ ఆదేశాలివ్వాలని తీవ్ర ఒత్తిడి తెచ్చినట్టు తెలిసింది. దాంతో గత నెల 25న తాను ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను మర్నాడే రద్దు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు.

### సీరియస్‌గా తీసుకున్న గుత్తా

తన ప్రతిపాదనల రద్దు వ్యవహారాన్ని గుత్తా సుఖేందర్‌రెడ్డి సీరియస్‌గా తీసుకున్నట్టు ఆయన అనుచరులు చెప్తున్నారు. అసెంబ్లీ సెక్రటరీని గుత్తా రంగంలోకి దించినట్టు తెలిసింది. దాంతో పనుల రద్దుపై వివరణ కోరుతూ ఈ నెల 4న నల్లగొండ కలెక్టర్‌కు అసెంబ్లీ సెక్రటరీ నోటీసులు జారీ చేసినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. స్వయంగా మండలి చైర్మన్ వద్ద హాజరై పనుల రద్దుకు కారణాలను చూపుతూ వివరణ ఇవ్వాలని అందులో పేర్కొన్నట్టు తెలిసింది. ఈ నోటీసు అందుకున్న కలెక్టర్ ఇదే విషయాన్ని మంత్రి కోమటిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన అసెంబ్లీ సెక్రటరీతో మాట్లాడినట్టు తెలిసింది. ఇదే విషయమై ఇన్‌చార్జి మంత్రి తుమ్మలతోనూ మంత్రి కోమటిరెడ్డి మాట్లాడినా మండలి చైర్మన్ గుత్తా వెనక్కి తగ్గినట్టు లేదని సమాచారం. ఇప్పటికే సుమారు రూ.50 లక్షల విలువైన పనులు సైతం వివిధ దశల్లో ఉన్నట్లు చెప్తున్నారు. ఈ వ్యవహారాన్ని తాడో పేడో తేల్చుకోవాలని గుత్తా భావిస్తున్నట్టు సమాచారం. వీటికితోడు తన కుమారుడు అమిత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ పార్టీలో చేరిన తన అనుచరుల పట్ల కొంతకాలంగా మంత్రి కోమటిరెడ్డితోపాటు ఆయన ముఖ్య అనుచరులు వ్యవహరిస్తున్న తీరు కూడా గుత్తా ఆగ్రహానికి తోడైనట్టు తెలిసింది. మండలి చైర్మన్ గుత్తా, మంత్రి కోమటిరెడ్డి మధ్య ఆధిపత్య పోరు జిల్లా అధికార యంత్రాంగం ఒత్తిడికి గురవుతున్నట్టు తెలుస్తున్నది.



శంకరపట్నం మండల కేంద్రంలో జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

## నెలాఖరు వరకు ఎస్సారెస్పీ నీళ్లివ్వాలి

- పొట్ట దశలో ఉన్న పంటలను కాపాడాలి
- కరీంనగర్ జిల్లా కేశవపట్నం, కరీంపేట్ రైతుల డిమాండ్
- శంకరపట్నంలో జాతీయ రహదారిపై ధర్నా

శంకరపట్నం, ఏప్రిల్ 9 : పంటల సాగుకు ఎస్సారెస్పీ నీటిని ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ జిల్లా కేశవపట్నం, కరీంపేట్ గ్రామాల రైతులు రోడ్డెక్కారు. నెలాఖరు వరకు నీళ్లు ఇవ్వకపోతే దాదాపు 300 ఎకరాల్లో పంటలు ఎండిపోతాయని ఆందోళన వ్యక్తంచేశారు. బుధవారం వారు శంకరపట్నంలోని జాతీయ రహదారిపై ధర్నా చేశారు. కాల్వ ద్వారా సాగునీటిని నిలిపివేయడంతో పూత, పొట్ట దశలో ఉన్న వరి చేతికి రాకుండా పోయే ప్రమాదం ఉన్నదని రైతులు ఆవేదన చెందారు. నెలాఖరు వరకు కాల్వ ద్వారా సాగునీటిని అందించి ఆదుకోవాలని వేడుకున్నారు. ధర్నాతో రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోగా, ఏఎస్సై సుధాకర్.. రైతులకు నచ్చజెప్పి ధర్నా విరమింపజేశారు.

### పదెకరాల పంట ఎండిపోతది

నేను పదెకరాల్లో వరి పెట్టిన. అది పొట్ట దశలో ఉన్నది. ఇప్పుడు కాల్వ నీళ్లు బంద్ జేసిన్రు. ఒకటి, రెండు తడులైతే పంట చేతికత్తది. నీళ్లు ఇవ్వకపోతే కేశవపట్నం, కరీంపేట్ గ్రామాల్లోని దాదాపు మూడు వందల ఎకరాల్లో ఉన్న పంటలు ఎండిపోతయి. సర్కారోళ్లు ఎట్లన్న జేసి ఈ నెలాఖరు దాక కాల్వ నీళ్లు ఇచ్చి పంటలను కాపాడాలె.

–కనుకయ్య, రైతు, కరీంపేట్

- సాగునీటి కోసం రైతుల రాస్తారోకో



సదర్మాట్ ఆయకట్టుకు సాగు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళనకు దిగారు. నిర్మల్ జిల్లా కడెం మండలంలోని లింగాపూర్, మల్లన్నపేట, ఎలగడప, దిల్దార్‌నగర్, మాసాయిపేట, నచ్చన్‌ఎల్లాపూర్, పెత్తార్పు, మద్దిపడగ, లక్ష్మీసాగర్, సారంగాపూర్ గ్రామాలకు చెందిన దాదాపు 300 మందికిపైగా రైతులు తరలివచ్చి నచ్చన్‌ఎల్లాపూర్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. దీంతో నిర్మల్–మంచిర్యాల ప్రధాన రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని రైతుల ఆందోళనను విరమింపజేసే ప్రయత్నం చేశారు. కలెక్టర్ అభిలాష అభినవ్ వచ్చి స్పష్టమైన హామీ ఇవ్వాలంటూ భీష్మించారు. తహసీల్దార్ ప్రభాకర్ కలెక్టర్‌తో మాట్లాడి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.– కడెం

# ధాన్యం.. అమ్మలేక దైన్యం

మొదటిపేజీ తరువాయి...

మూడంటే మూడు జిల్లాల్లోనే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసింది. ఈ నెల 7వ తేదీ వరకు 68 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ఇందులో నిజామాబాద్ జిల్లా నుంచి 60,982 టన్నులు, నల్లగొండ నుంచి 4,212 టన్నులు, కామారెడ్డి జిల్లా నుంచి 3 వేల టన్నులు కొనుగోలు చేసింది. మరో ఎనిమిది జిల్లాల్లో కొన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ, ఆయా జిల్లాల్లో ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ యాసంగిలో 8,200 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నట్టు సివిల్‌సప్లయ్ సంస్థ గొప్పగా ప్రకటించింది. కానీ, ఈ నెల 7వ తేదీ వరకు 11 జిల్లాల్లో 1,272 కేంద్రాలు మాత్రమే ప్రారంభించింది. అంటే లక్ష్యంలో ఇవి 15 శాతమే. ఈ విధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటంతో రైతులు పడిగాపులు కాస్తున్నారు.



హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్‌లో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

### కావాలనే కొనడం లేదా?

ధాన్యం కొనుగోళ్ల విషయంలో సర్కారు పెద్దలు, సివిల్‌సప్లయ్ అధికారుల తీరుపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉద్దేశపూర్వకంగానే ధాన్యం కొనుగోళ్లను ఆలస్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ఈ సీజన్‌లో 70 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందుకోసం రూ.16 వేల కోట్లకుపైగా నిధులు అవసరం. దీంతోపాటు కనీసంగా 25 లక్షల టన్నుల సన్నధాన్యం కొనుగోలు చేస్తే బోనస్ రూపంలో మరో రూ.1,200 కోట్లకు పైగా అవసరమని అంచనా. ఇంత మొత్తం వెచ్చించడం ఇష్టంలేకనే ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల విషయంలో జాప్యం చేస్తున్నదనే విమర్శలొస్తున్నాయి. వాస్తవానికి, మార్చి రెండో వారం నుంచి వరి కోతలు మొదలవుతాయని అధికారులకు తెలుసు. దీంతో మార్చి 20 నుంచే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్టు సివిల్‌సప్లయ్ డైరెక్టర్ వీఎస్‌ఎన్వీ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులిచ్చి 21 రోజులైనా, ఇంకా 21 జిల్లాల్లో అసలు కొనుగోలు కేంద్రాలే ప్రారంభించకపోవడం, 29 జిల్లాల్లో ఒక్క గింజ కూడా కొనుగోలు చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మార్చి 20న ఉత్తర్వులు జారీ చేసిన సివిల్ సప్లై సంస్థ.. ఇన్ని రోజులు ఎందుకు ధాన్యం కొనుగోలు చేయలేదు? ఎందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

| | |
|---|---|
| ప్రభుత్వం ఏర్పాటు చేస్తామన్న కొనుగోలు కేంద్రాలు | 8,200 |
| ఇప్పటివరకు ఏర్పాటుచేసిన కేంద్రాలు | 1,272 |
| కొనుగోలు కేంద్రాలు ప్రారంభించని జిల్లాలు | 21 |
| కొనుగోళ్లు కొనసాగుతున్న జిల్లాలు | 3 |
| ఒక్క గింజ కూడా కొనుగోలు చేయని జిల్లాలు | 29 |
| యాసంగి ధాన్యం కొనుగోలు లక్ష్యం | 70 లక్షల టన్నులు |
| ఇప్పటివరకు కొనుగోలు చేసింది | 68 వేల టన్నులు |

### పొంచి ఉన్న వాన గండం!

ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా అడపా దడపా అకాల వర్షాలు కురుస్తున్నాయి. రాబోయే మూడు, నాలుగు రోజులపాటు వానలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంట ఎక్కడ వానపాలై పోతుందోనని ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యాన్ని సర్కారు వెంటనే కొనుగోలు చేసి ఉంటే, రైతులకు ఈ టెన్షన్ ఉండేది కాదు. వర్షాలు పడితే, తడవకుండా ధాన్యాన్ని కాపాడుకొనేందుకు కొనుగోలు కేంద్రాల వద్ద ప్రభుత్వం కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదు. రైతులకు ప్రతి సంవత్సరం ఇచ్చే టార్పాలీన్లను సైతం ఈ సీజన్‌లో సరఫరా చేయలేదు. ఇప్పటివరకు వీటి కొనుగోలుకు టెండర్లే పిలవలేదు. రైతులకు ఉపయోగపడే పాడీ క్లీనర్లు, ఇతర పరికరాలను సైతం కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేయలేదు.

### కేంద్రాల్లో రైతుల పడిగాపులు

కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో ధాన్యం రైతులు గోస పడుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు చేస్తుందనే ఆశతో రైతులంతా తమ ధాన్యాన్ని ఐకేపీ కేంద్రాలకు తీసుకొస్తున్నారు. కానీ, సర్కారు మాత్రం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదు. అక్కడక్కడ ప్రారంభించిన కేంద్రాల్లోనూ కొనుగోళ్లు మొదలు పెట్టలేదు. దీంతో రైతులు ఆయా కేంద్రాల వద్ద రోజుల తరబడి ధాన్యం బస్తాలతో పడిగాపులు కాస్తున్నారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ రేయింబవళ్లు ధాన్యాన్ని కాపాడుకొనేందుకు నానా తంటాలు పడుతున్నారు. అయినప్పటికీ, అధికారులు వచ్చి కాంటా పెట్టడం లేదు.

### తేమ, తాలు పేరుతో బస్తాకు 2 కిలోల కోత

సర్కారు నిర్లక్ష్యంతో ఇప్పటికే గోస పడుతున్న రైతులకు కొనుగోలు కేంద్రాల్లో ఐకేపీ నిర్వాహకులు, మిల్లర్ల తీరుతో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ధాన్యం తూకంలో అడ్డగోలు కోతలు పెడుతున్నట్టు రైతులు ఆరోపిస్తున్నారు. తేమ, తాలు నెపంతో ఒక్కో బస్తాకు 2 నుంచి 3 కిలోలు కోత పెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వాస్తవానికి, ఒక బస్తాకు 40 కేజీలు మాత్రమే తూకం వేయాలి. కానీ, ఐకేపీ నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మకై ఒక్కో బస్తాకు 42–43 కిలోలు తూకం వేస్తూ, షీట్‌లో మాత్రం 40 కిలోలకే లెక్క చూపుతున్నారని రైతులు చెప్తున్నారు. దీంతో నిజామాబాద్ జిల్లా కోటగిరి, గోన్‌గొప్ప గ్రామాల్లో తేమ పేరుతో తరుగు తీస్తున్నారని రైతులు ధర్నాకు దిగారు.

### వ్యాపారుల దోపిడీ.. రైతన్నకు టోకరా

ధాన్యం కొనుగోళ్లలో సర్కారు నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకున్న వ్యాపారులు, మిల్లర్లు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. తక్కువ ధరకే ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులకు నష్టం చేస్తున్నారు. ధాన్యం మద్దతు ధర రూ.2,320తోపాటు బోనస్ రూ.500 కలిపి రైతులకు రూ.2,820 దక్కాలి. కానీ, మొన్నటివరకు సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.2,400 వరకు చెల్లించిన మిల్లర్లు ఇప్పుడు రూ.2,200 మాత్రమే చెల్లిస్తున్నారు. అదేమిటని ప్రశ్నిస్తే.. 'మా ధర ఇంతే.. ఇష్టముంటే అమ్ము.. లేకుంటే లేదు' అని తెగేసి చెప్తున్నారు. పోనీ, వ్యాపారుల వద్దకు వెళ్లకుండా, సర్కారుకే అమ్ముకుందామంటే.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవడం లేదు. ఒకవేళ తెరిసినా నానా రకాల కొర్రీలతో రోజుల తరబడి తిప్పుకొంటున్నారు. సర్కారు పెట్టే కొర్రీలు, ఇబ్బందులు భరించలేక రైతులు వ్యాపారులకే నష్టానికి అమ్ముకుంటున్నారు.

## చెడగొట్టు వానకు దెబ్బ తిన్న పంటలు

### నర్సంపేట మార్కెట్‌లో భారీగా తడిసిన మక్కలు

నర్సంపేట, ఏప్రిల్ 9: వరంగల్ జిల్లా నర్సంపేటలో మంగళవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం అన్నదాతను దెబ్బతీసింది. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఆరబోసిన మక్కలు కొట్టుకుపోయాయి. పెద్ద మొత్తంలో పంట తడిసిపోవడంతో రైతులు లబోదిబోమన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో చేతికొచ్చిన మక్కజొన్న, వరి పంటలు నేలకొరిగాయి. మామిడి కాయలు నేలరాలడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారు. మహేశ్వరం, లక్నేపల్లి గ్రామ శివారు నర్సంపేట–వరంగల్ ప్రధాన రహదారి, నర్సంపేట–మల్లంపల్లి ప్రధాన రహదారుల్లో ఈదురు గాలులకు పెద్దపెద్ద చెట్లు విరిగిపడ్డాయి.

## వారంలోగా 83 వేల టన్నుల బియ్యం ఇవ్వండి

### రైస్ మిల్లర్లకు పౌరసరఫరాల శాఖ ఆదేశం

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): ఫిలిప్పీన్స్‌కు ఎగుమతి చేసేందుకు ఏడు రోజుల్లోగా 83 వేల టన్నుల బియ్యాన్ని అందించాలని రాష్ట్ర ప్రభుత్వం మిల్లర్లను ఆదేశించింది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ జిల్లాలవారీగా అలాంట్‌మెంట్ ఇస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఫిలిప్పీన్స్‌కు 2022–23 యాసంగి టెండర్ ధాన్యం నుంచే లక్ష టన్నుల బియ్యాన్ని ఎగుమతి చేస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఇప్పటికే మిల్లర్ల నుంచి 17 వేల టన్నుల బియ్యాన్ని తీసుకున్న ప్రభుత్వం.. అందులో ఇటీవల 12,500 టన్నులు ఎగుమతి చేసిన విషయం తెలిసిందే. మిగిలిన 83 వేల టన్నుల బియ్యం ఎగుమతి కోసం వెంటనే ధాన్యం మిల్లింగ్‌ను ప్రారంభించాలని తాజాగా పౌరసరఫరాల శాఖ ఆదేశించింది. 2022–23 యాసంగి సీజన్‌కు సంబంధించిన 35 లక్షల టన్నుల ధాన్యాన్ని నిరుడు ప్రభుత్వం వేలం ద్వారా విక్రయించింది. అందులో మిల్లర్లు ఇంకా 14.58 లక్షల టన్నుల ధాన్యాన్ని ఎత్తలేదని ప్రభుత్వం ఒప్పుకున్నది. ఆ ధాన్యం నుంచే లక్ష టన్నుల బియ్యాన్ని ఎగుమతి చేస్తున్నట్టు పేర్కొన్నది. ధాన్యాన్ని ఎత్తేందుకు ఇటీవల మరో 3 నెలల గడువు పొడగించిన ప్రభుత్వం.. ఆ ధాన్యాన్ని బిడ్డర్లకు వదిలేయకుండా బియ్యం ఎగుమతి చేయడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.